

పోలీసులు దిద్దిన కాపురం..
భార్యాభర్తల మధ్య చిన్న పాటి గొడవలకే ఆలుమగలు ఠాణా మెట్లెక్కుతున్నారు. పోలీసులు వారికి కౌన్సెలింగ్ ఇచ్చి కాపురాలను సరిదిద్దుతున్నారు. 10లో▸



సామూహిక కుంకుమార్చన
ఆదిలాబాద్: చివరి శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని పట్టణంలోని కొలిపుర్ శ్రీబద్ది పోచమ్మ ఆలయంలో సామూహిక కుంకుమార్చన నిర్వహించారు.

గరిష్టం/కనిష్టం
29.0 /24.0

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

నేడు జాతీయ లోక్‌అదాలత్

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని కోర్టు ఆవరణలో శనివారంజాతీయ లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్లు డీఎల్ఎస్ఏ కార్యదర్శి క్షమాదేశ్‌పాండే ప్రకటనలో తెలిపారు. కక్షిదారులు రాజీ మార్గం ద్వారా కేసులను పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు.

16న జిల్లాస్థాయి సైన్స్ సెమినార్

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా స్థాయి సైన్స్ సెమినార్‌ను ఈనెల 16న జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించనున్నట్లు డీఈవో ప్రణీత, జిల్లా సైన్స్ అధికారి రఘురమణ ప్రకటనలో తెలిపారు. సెమినార్‌లో చిరుధాన్యాలు.. ఒక ఉత్తమమైన ఆహారం అనే అంశంపై ప్రదర్శన నిర్వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తిగల విద్యార్థులు సెమినార్‌లో పాల్గొనాలని సూచించారు. వివరాల కోసం 9440060288 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన రాథోడ్ రమేశ్



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తూ..

కైలాస్‌నగర్: జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారిగా నియామకమైన రాథోడ్ రమేశ్ శుక్రవారం కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. క్యాంపు కార్యాలయంలో కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

ఎమ్మెల్యేను అడ్డుకునే యత్నం

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని భగత్‌సింగ్ నగర్‌లో నిర్వహించిన పార్టీ చేరికల కార్యక్రమానికి హాజరైన ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్నను బీజేవైఎం నాయకులు శుక్రవారం అడ్డుకునే యత్నం చేశారు. మౌలిక వసతులు కల్పించడంలో ఎమ్మెల్యే విఫలమయ్యారంటూ కాలనీలోకి రావద్దని అడ్డుకునే యత్నం చేశారు. దీంతో వారిని పోలీసులు అడ్డుకోవడంతో స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. బీజేవైఎం నాయకులను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు.

55వ రోజుకు డివిజన్ దీక్షలు



దీక్షలో కూర్చున్న సమితి సభ్యులు

బోథ్: బోథ్‌ను డివిజన్ చేయాలని డిమాండ్ చేస్తూ చేపడుతున్న దీక్షలు 55వ రోజుకు చేరాయి. శుక్రవారం దీక్షలో డివిజన్ సాధన సమితి సభ్యులు కూర్చున్నారు. బోథ్ డివిజన్‌గా ప్రకటించకుంటే ఎన్నికలను బహిష్కరిస్తామని స్పష్టం చేశారు. ప్రజా ప్రతినిధులు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

బాలలను చదివించాల్సిన బాధ్యత అందరిది



విద్యార్థులతో యశోద

కైలాస్‌నగర్: బేటీ బచావో.. బేటీ పడావోలో భాగంగా బాలలను రక్షించడంతో పాటు వారిని చదివించాల్సిన బాధ్యత సమాజంలోని ప్రతీఒక్కరిపై ఉందని మహిళ సాధికారత మిషన్ శక్తి కోఆర్డినేటర్ యశోద అన్నారు. శుక్రవారం సంజయనగర్ కాలనీలోని రిజర్వ్ పోలీస్ లైన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అవగాహన కల్పించారు. మహిళ పథకాలు (సుకన్య సమృద్ధి యోజన), మహిళ చట్టాలు, బాల్య వివాహాలు, ఫోక్సో చట్టాలు, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సఖీసిబ్బంది నాగమణి, జిల్లాసాధికారత కేంద్రంసభ్యుడు కోటేశ్వర్,నిఖిలేష్ పాల్గొన్నారు.

టీఆర్టీ వచ్చేసింది..

- జిల్లాలో భర్తీ కానున్న 275 పోస్టులు
- పుస్తకాలతో కుస్తీకి సిద్ధమవుతున్న నిరుద్యోగులు
- ఈనెల 20 నుంచి దరఖాస్తు ప్రక్రియ
- నవంబర్ 20 నుంచి ఆన్‌లైన్‌లో పరీక్షలు

ఆదిలాబాద్‌టౌన్: ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఉపాధ్యాయ (టీఆర్టీ) నోటిఫికేషన్ వచ్చేసింది. బీఎడ్, డీఎడ్ పూర్తి చేసిన నిరుద్యోగ అభ్యర్థులకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఐదేళ్లుగా టీచర్ కొలువుల కోసం వేలాది మంది నిరీక్షిస్తున్న విషయం తెలిసిందే. ఎట్టకేలకు నోటిఫికేషన్ ప్రకటనపై వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వం టెట్ నోటిఫికేషన్ విడుదల చేసి ఈనెల 15న పరీక్ష నిర్వహించేందుకు సన్నద్ధమైంది. తాజాగా గురువారం రాత్రి విద్యాశాఖ టీఆర్టీ నోటిఫికేషన్ జారీ చేయడంతో అభ్యర్థుల్లో హర్షం వ్యక్తమవుతోంది. జిల్లాలో 275 పోస్టులను భర్తీ చేయనున్నారు. ఈనెల 20 నుంచి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం కానుండగా, నవంబర్ 20 నుంచి ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహించనున్నారు. దీంతో అభ్యర్థులు కోచింగ్‌కు సన్నద్ధమవుతున్నారు. రెండు నెలల గడువు ఉండడంతో పుస్తకాలతో కుస్తీకి సిద్ధమతున్నారు.

బయోసైన్స్ లోకల్‌బాడీలో 8, ఫిజికల్ ఎడ్యుకేషన్ తెలుగు మీడియం లోకల్‌బాడీలో 1, ప్రభుత్వ 1, ఫిజికల్ సైన్స్‌లో లోకల్‌బాడీ 2, ప్రభుత్వ 1, సాంఘిక శాస్త్రంలో లోకల్‌బాడీ 17, ప్రభుత్వ 2, తెలుగు లోకల్‌బాడీ 4, గణితం ఉర్దూ మీడియం ప్రభుత్వ 1, ఫిజికల్ సైన్స్ ఉర్దూ మీడియం లోకల్‌బాడీ 1, ప్రభుత్వ 2, సాంఘిక శాస్త్రం ఉర్దూ మీడియం లోకల్‌బాడీ 1, ప్రభుత్వ 1, ఉర్దూ మీడియం లోకల్‌బాడీ 1, హిందీ 2, ఇంగ్లీష్ లోకల్‌బాడీ 5, మరాఠీ మీడియం గణితం లోకల్‌బాడీ 1, ఎస్ఏ ఫిజికల్ ఎడ్యుకేషన్ మరాఠీ మీడియం లోకల్‌బాడీ 1, సాంఘిక శాస్త్రం మరాఠీ మీడియం లోకల్‌బాడీలో 2 పోస్టులు ఉన్నాయి. ఇక లాంగ్వేజ్ పండిత్ తెలుగు లోకల్‌బాడీ 3, ప్రభుత్వ 6, ఉర్దూ మీడియం లోకల్‌బాడీలో 2, ఎల్పీ మరాఠీ లోకల్‌బాడీలో 2 పోస్టులు ఉన్నాయి.

ఎస్జీటీ లోకల్‌బాడీ 1, ప్రభుత్వ 5, ఎస్జీటీ మరాఠీ మీడియం లోకల్‌బాడీ 10, ప్రభుత్వ 4, ఎస్జీటీ తెలుగు లోకల్‌బాడీ 128, ప్రభుత్వ 17, ఉర్దూ లోకల్‌బాడీ 31, ప్రభుత్వ 10 పోస్టులు ఉన్నాయి. అలాగే పీఈటీ హిందీ ప్రభుత్వ 1, పీఈటీ తెలుగు ప్రభుత్వ 1 పోస్టులను భర్తీ చేయనున్నారు.

జిల్లాలో భర్తీ కానున్న ఆయా ఉపాధ్యాయ పోస్టుల వివరాలు..

	ప్రభుత్వ	లోకల్‌బాడీ
ఎస్జీటీ	36	170
ఎస్ఏ	08	46
ఎల్పీ	06	07
పీఈటీ	02	--



ప్రిపేరవుతున్న అభ్యర్థులు

జిల్లాలో ఖాళీలు ఇలా..
జిల్లాలో మొత్తం 275 పోస్టులను టీఆర్టీ ద్వారా భర్తీ చేయనున్నారు. ఇందులో స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 54 ఉండగా, భాషా పండిత పోస్టులు 13, పీఈటీ 2, ఎస్జీటీ 206 ఉన్నాయి. సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంలో బీఈడీ వారికి ప్రస్తుతం స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు మాత్రమే అర్హత ఉండడంతో వీటికి పోటీ తీవ్రంగా ఉండే అవకాశం ఉంది. సబ్జెక్టుల వారీగా ఈ పోస్టులను పరిశీలిస్తే ఇలా ఉండే అవకాశం ఉంది.

ఐదేళ్లుగా ఎదురుచూస్తున్న



నేను ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో 2015–17 బ్యాచ్‌లో డీఎడ్ పూర్తి చేశా. 2018 డీఎస్సీలో అవకాశం కల్పించలేదు. అప్పటినుంచి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నాను. డిగ్రీ, పీజీ పూర్తి చేశాను. ఇప్పటికే టెట్ క్వాలిఫై అయ్యాను. మరోసారి టెట్ రాసేందుకు సిద్ధమవుతున్నా. ఆలస్యంగానైనా ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయడం సంతోషకరం. కష్టపడి చదివి ప్రభుత్వ ఉద్యోగం సాధిస్తాను.

– సృష్టి, డీఈడీ అభ్యర్థి

సమయం తక్కువగా ఉంది



ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయడం సంతోషంగా ఉంది. అయితే రెండు నెలలు మాత్రమే సమయం ఉంది. మరికొంత సమయం ఇస్తే బాగుండేది. ఇంటి వద్దనే ఉండి ప్రిపేర్ అవుతాను. పోటీ తీవ్రంగా ఉండనుంది. అయినా ప్రణాళికాబద్ధంగా చదివి లక్ష్యాన్ని సాధిస్తా.

– నికిత, అభ్యర్థి

గణితంలో ఒక్క పోస్టు కూడా లేదు..



కొన్నేళ్లుగా టీఆర్టీ కోసం ఎదురుచూస్తున్నాను. ప్రస్తుతం టెట్‌తో పాటు టీఆర్టీకి సిద్ధమవుతున్నాను. గణితం తెలుగు మీడియంలో ఒక్క పోస్టు లేకపోవడం బాధగా ఉంది. ప్రస్తుతం ఉపాధ్యాయ బదిలీ, పదోన్నతుల ప్రక్రియ చేపడుతున్నారు. ఖాళీగా ఉన్న సంబంధిత సబ్జెక్టు పోస్టులను భర్తీ చేయాలి.

– యేర కవిత, అభ్యర్థి

ప్రణాళికాబద్ధంగా చదివితే లక్ష్యం సులువు..



అభ్యర్థులు ప్రణాళికాబద్ధంగా చదవాలి. అలాగే ప్రమాణిక పుస్తకాలను ఎంపిక చేసుకోవాలి. సబ్జెక్టుల వారీగా సమయం కేటాయించాలి. రోజుకు ఎన్ని గంటలు చదవామన్నది కాకుండా, చదివింది ఎంతవరకు అర్థమైందన్నదే ముఖ్యం. సమయం తక్కువగా ఉండడంతో సన్నద్ధతకు ప్రాధాన్యతనివ్వాలి. సినిమాలు, టీవీలు, సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలి. పరీక్ష ముగిసే వరకు ఆహారం, నిద్ర విషయంలో జాగ్రత్తలు పాటించాలి. అవసరమైన విషయాల కోసం నిపుణుల సలహాలు తీసుకోవాలి. లక్ష్యం దిశగా కష్టపడి చదివితే విజయం తథ్యం.

–కిరణ్‌కుమార్, డైట్ వైస్ ప్రిన్సిపాల్

రిమ్స్‌లో ఇద్దరు ఉద్యోగులపై కొరడా

- 'సాక్షి' కథనాలకు స్పందించిన డైరెక్టర్
- డీఎంఈకి ఓ ఉద్యోగి సరెండర్
- కాంట్రాక్ట్ ఉద్యోగి టర్మినేట్



మరో వసూల్ రాణి!

ఇటీవల 'సాక్షి'లో ప్రచురితమైన కథనం

సాక్షి స్పందన

ఆదిలాబాద్‌టౌన్: 'సాక్షి'లో ప్రచురితమైన కథనాలకు రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ స్పందించారు. ఇద్దరు ఉద్యోగులపై కొరడా ఝులిపించారు. ఇటీవల 'సాక్షి'లో 'మరో వసూల్‌రాణి' శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే.ఈ క్రమంలో కారకురాలైన సీనియర్ అసిస్టెంట్‌ను డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌కు సరెండర్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే ఐదుగురు సభ్యుల కమిటీతో విచారణ కొనసాగుతుంది. అదే విధంగా రిమ్స్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని ఓ నిరుద్యోగి నుంచి డబ్బులు వసూలు చేసిన ల్యాబ్ అసిస్టెంట్‌ను టర్మినేట్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సంబంధిత ఏజెన్సీకి నోటీసు కూడా పంపించారు. ఉద్యోగులు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని, అక్రమాలకు పాల్పడితే శాఖాపరమైన చర్యలు తప్పవని డైరెక్టర్ హెచ్చరించారు.



ఆశ చూపి.. కాజేస్తూ!

'ఆశ చూపి కాజేస్తూ..' అనే శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనం

ఓటరుగా చిరునామా మార్చుకున్న కలెక్టర్

- తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి ఫారం–8 అందజేత

కైలాస్‌నగర్: ఓటరు జాబితా సవరణలో భాగంగా కలెక్టర్ రాహుల్‌రాజ్ ఓటరుగా తన చిరునామాను ఆదిలాబాద్‌కు మార్చుకున్నారు. హైదరాబాద్‌లో ఉన్న తన, కుటుంబ సభ్యుల చిరునామా మార్పునకు సంబంధించి ఫారం–8ను శుక్రవారం తహసీల్దార్ శ్రీనివాస్‌కు అందజేశారు. కలెక్టరేట్‌లోని అర్బన్ మండల తహసీల్దార్ కార్యాలయానికి స్వయంగా వెళ్లిన ఆయన తన ఓటు హక్కును ఆదిలాబాద్‌లోని 261వ నంబర్ పోలింగ్ కేంద్రంలోకి మార్చాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అక్టోబర్ 1, 2023 నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా తమ పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. అలాగే ఓటరు కార్డు ఉండి జాబితాలో పేరు లేని వారు, మరణించిన వారి పేరు తొలగింపు, చిరునామా మార్పునకు సంబంధించిన దరఖాస్తులను ఈ నెల 19లోగా ఆయా పోలింగ్ కేంద్రాలు, తహసీల్దార్ల కార్యాలయాల్లో సమర్పించాలని కోరారు.



తహసీల్దార్‌కు ఫారం 8ను అందజేస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

దుష్ప్రచారం ఆపకుంటే గుణపాఠం తప్పదు

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత
- వేంకటేశ్వర ఆలయంలో ప్రమాణం

కైలాస్‌నగర్: రాజకీయంగా ఎదుర్కొనే ధైర్యం లేకనే ఎమ్మెల్యే జోగు రామన్న అనుచరులు ఉద్దేశపూర్వకంగా తనపై దుష్ప్రచారం చేస్తున్నారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత అన్నారు. ఈ అసత్య ప్రచారాన్ని తక్షణమే ఆపాలని, లేకుంటే తమ పార్టీ కార్యకర్తల చెప్పుదెబ్బలతో తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఎమ్మెల్యే జోగు రామన్న నుంచి తాను డబ్బులు తీసుకున్నట్లు జరుగుతున్న ప్రచారాన్ని ఖండిస్తూ శుక్రవారం ఆమె జిల్లా కేంద్రంలోని శ్రీవేంకటేశ్వర ఆలయంలో స్వామిపై ప్రమాణం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం విలేకరులతో మాట్లాడారు. అధికార పార్టీ నాయకుల తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తాను ఎవరికి అమ్ముడుపోయే వ్యక్తిని కాదని, ఎవరి నుంచి నయా పైసా తీసుకోవాల్సిన అవసరం తనకు లేదన్నారు. డబ్బుపై వ్యామోహమే ఉంటే రాజకీయంగా పరాజయం పాలైనప్పటికీ ఇన్నేళ్లు ప్రజా జీవితంలో ఉండగలిగే వారమా అని ప్రశ్నించారు. రానున్న ఎన్నికల్లో మహిళలైన తాను ఎన్నికల బరిలో ఉంటే ఓడిపోతామనే భయంతోనే ఎమ్మెల్యే రామన్న తన అనుచరులతో దుష్ప్రచారం చేయిస్తున్నారని ధ్వజమెత్తారు. అసత్య ఆరోపణలు చేస్తున్న వారు దమ్ముంటే వాటిని నిరుపించాలని సవాలు విసిరారు. లేనిపక్షంలో తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సంజీవ్ రెడ్డి, అశోక్, సాయి చరణ్ గౌడ్, రుపేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆలయం వద్ద ప్రమాణం చేస్తున్న సుజాత

ఆగని 'సమగ్ర శిక్ష' ఆందోళన

కైలాస్‌నగర్: ఉద్యోగ భద్రత కల్పించాలనే డిమాండ్‌తో సమగ్రశిక్ష ఒప్పంద ఉద్యోగులు చేపట్టిన సమ్మె 11వ రోజుకు చేరింది. శుక్రవారం సమ్మె శిబిరం నుంచి ఎన్టీఆర్‌చౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. కప్పగంతులు వేసి సర్కారు తీరుపై నిరసన తెలిపారు. అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. అక్కడి నుంచి కుమురంభీం చౌక్‌కు చేరుకుని గంటపాటు బైఠాయించారు. ప్రభుత్వం స్పందించే దాకా సమ్మె ఆపేదిలేదని వారు స్పష్టం చేశారు.



కప్ప గెంతులు వేస్తూ నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

గ్రామీణ రోడ్లకు రూ.80 కోట్లు

- గతేడాది వర్షాలకు దెబ్బతిన్న రహదారులకు..
- జిల్లాలో 41 పనులు.. ఇటీవలే టెండర్లు పూర్తి
- తాజాగా మరో రూ.8 కోట్లు మంజూరు

సాక్షి,ఆదిలాబాద్: ఇంద్రవెల్లి మండలంలోని ముత్నూర్ నుంచి కోయల్‌పాండ్రి వరకు సుమారు 10 కిలోమీటర్ల పరిధిలో తారు రోడ్డుకు సంబంధించి కొన్నేళ్లుగా మరమ్మతు చేయకపోవడంతో పూర్తిగా దెబ్బతింది. గతేడాది కురిసిన వర్షాలతో ఆ రహదారి పూర్తిగా అధ్వానంగా మారింది. అప్పట్లో ఈ రోడ్డుకు సంబంధించి పంచాయతీరాజ్ శాఖాధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదన పంపగా, ఇటీవల దీనికి రూ.7.40 కోట్లు మంజూరయ్యాయి. టెండర్ ప్రక్రియ కూడా పూర్తయింది. పనులు ప్రారంభిస్తున్నారు. జిల్లాలో ఇలాంటి అనేక గ్రామీణ రోడ్లకు సంబంధించి నిధులు మంజూరయ్యాయి.

ఎఫ్‌డీఆర్ కింద..
వరదలకు దెబ్బతిన్న రోడ్లు (ఎఫ్‌డీఆర్) కింద ప్రభుత్వం జిల్లాకు ఇటీవల రూ.80 కోట్ల నిధులను పంచాయతీరాజ్ శాఖకు మంజూరు చేసింది. దీనికి సంబంధించి టెండర్ ప్రక్రియను అధికారులు పూర్తి చేశారు. 41 పనులను ఈ నిధుల కింద చేపట్టారు. ఇందులో కొన్నిచోట్ల కొత్త రోడ్ల నిర్మాణం, మరి కొన్ని చోట్ల మరమ్మతులు చేపడుతున్నారు. ఆ పనులు ఇప్పుడిప్పుడే మొదలవుతున్నాయి. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో పనులకు కొంత ఆటంకంగా మారింది. వర్షాలు తగ్గగానే ఊపందుకునే పరిస్థితి ఉందని అధికారులు చెబుతున్నారు. ఇదిలా ఉంటే మరో మూడు రోడ్ల పనులకు సంబంధించి రూ.8 కోట్లు కూడా తాజాగా మంజూరయ్యాయి. నేరడిగొండ, నార్నూర్ మండలాల్లో ఈ రోడ్లకు సంబంధించి టెండర్లు చేపట్టాల్సి ఉన్నాయి.

ఈ ఏడాది కూడా భారీ నష్టమే..
ఆదిలాబాద్ జిల్లాలో ఈ వానాకాలంలో కురిసిన భారీ వర్షాలకు రోడ్లు పూర్తిగా అస్తవ్యస్తంగా తయారయ్యాయి. పంచాయతీరాజ్ రోడ్లకు సంబంధించి 111 రోడ్లు, వంతెనలు, కల్వర్టులు 144 కిలో మీటర్ల మేర అధ్వానంగా మారింది. తాత్కాలిక మరమ్మతులకు రూ.67 లక్షలు అవసరం కాగా, రోడ్లు, బ్రిడ్జిల పూర్తిస్థాయి పునరుద్ధరణకు రూ.255 కోట్లు అవసరమని సంబంధిత అధికారులు ఇటీవలే ప్రభుత్వానికి నివేదించారు. గతేడాది వర్షాల కారణంగా జరిగిన నష్టానికి ప్రస్తుతం నిధులు మంజూరై పనులు మొదలు కాగా, ఈతేడాది జరిగిన నష్టానికి సంబంధించి ప్రతిపాదనలు ప్రభుత్వం వద్ద పెండింగ్ ఉన్నాయి.

ఈ విషయంలో పంచాయతీరాజ్ ఈఈ మహవీర్‌ను వివరణ కోరగా, ఎఫ్‌డీఆర్ కింద మంజూరైన నిధులకు సంబంధించి టెండర్ ప్రక్రియ పూర్తి చేసి పనులను పూర్తిస్థాయిలో ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే అన్ని పనులను పూర్తి చేస్తామని వివరించారు.



ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం న్యూ హీరాపూర్ గ్రామ రోడ్డు దుస్థితి (ఫైల్)

నీటి సరఫరాకు సంప్రదించండి

కైలాస్‌నగర్: జిల్లా కేంద్రంలో ఐదు రోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోయిన విషయం తెలిసిందే. ఈమేరకు ప్రజలు నీటి సరఫరా కోసం బల్దియా సిబ్బంది ఆకాశ్, పోశెట్టిని 8125484820,7794049873నంబర్లలో సంప్రదించాలని మున్సిపల్ కమిషనర్ శైలజ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం రాత్రి నీటి సరఫరా ప్రారంభమవుతుందని,శనివారం మధ్యాహ్నం నుంచి ఆదిలాబాద్ పట్టణానికి తాగు నీరు అందించనున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న లాండసాంగ్వీ, మావల చెరువు ల నుంచి నీటిని రోజు విడిచి రోజు సరఫరా చే సే క్రమంలో విద్యుత్ అంతరాయంతో కొన్ని వార్డులకు రాత్రివేళలోసరఫరా చేస్తున్నట్లు తెలి పారు. ప్రజలు విషయాన్ని గమనించి సహకరించాలని ఆమె కోరారు.

నవరాత్రోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రామన్న తదితరులు

- ఎమ్మెల్యే జోగు రామన్న

ఆదిలాబాద్: జిల్లా ప్రజలు భక్తిశ్రద్ధలతో గణపతి నవరాత్రి ఉత్సవాలను నిర్వహించుకోవాలని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని శ్రీరామచంద్ర గోపాలకృష్ణమఠంలో కిసాన్ మిత్ర గణేష్ మిత్రమండలి ఆధ్వర్యంలో ప్రచురించిన కర్ర గణపతి నవరాత్రి వేడుకల వాల్ పోస్టర్‌ను ఎమ్మెల్యే శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలోనే అంగరంగ వైభవంగా నవరాత్రోత్సవాలను నిర్వహించడంలో ఆదిలాబాద్ జిల్లాకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఉత్సవాలు ఎలాంటి విఘ్నాలు లేకుండా సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మెట్టు ప్రహ్లాద్, భాస్కర్‌గౌడ్, నారాయణ, కృష్ణ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

14మందికి జరిమానా

నిర్మల్‌టౌన్‌: మద్యం తాగి వాహనాలు నడిపిన 14మందికి జరిమానా, ముగ్గురికి రెండు రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ నిర్మల్‌ న్యాయస్థానం తీర్పించినట్లు పట్టణ ట్రాఫిక్‌ ఎస్సైలు రాజశేఖర్, దేవేందర్‌ తెలిపారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం పోలీసులు వాహనాలు తనిఖీ చేపట్టారు. మద్యం మత్తులో వాహనం నడుపుతూ పలువురు పట్టుబడగా వారిని నిర్మల్‌ కోర్టులో హాజరు పరిచారు. 14మందికి రూ.11900 జరిమానా విధిస్తూ ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి తీర్పునిచ్చారు. మద్యం సేవించి వాహనాలు నడిపి ప్రమాదాలకు కారణం కావద్దని ట్రాఫిక్‌ ఎస్సైలు పేర్కొన్నారు.

నాటుసారా స్వాధీనం



నాటుసారా పట్టుకున్న అధికారులు

ఉట్నూర్‌రూరల్‌: మండలంలోని దంతన్‌పల్లి, కొత్తగూడ, లక్కారం గ్రామాల్లో నాటుసారా తయారీతో పాటు విక్రయిస్తున్న స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్‌శాఖ సీఐ మహేందర్‌ సింగ్‌ తెలిపారు. శుక్రవారం ఆదిలాబాద్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ సీఐ రాజేశ్‌తో కలసి ఆయా ప్రాంతాల్లో నాటుసారా తయారు చేయడంతో పాటు విక్రయిస్తున్న ప్రాంతాల్లో దాడులు చేసి మూడు లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. కొత్తగూడకు చెందిన ప్రమీల, తాటిగూడకు చెందిన తుమ్రం చిన్నుపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

కొండ చిలువ హతం

సిరికొండ: మండలంలోని సూర్యపేట్‌ గ్రామంలో గురువారం రాత్రి ఆత్రం సావిత్రిబాయి ఇంట్లో శబ్దం కావడంతో సావిత్రిబాయి నిద్రలేచి చూడగా కొండచిలువ కనిపించింది. ఒక్కసారిగా భయంతో కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి చూడగా కొండ చిలువ ఇంట్లోని కోడిని తింటు కనిపించింది. దీంతో గ్రామస్తులు భయంతో కర్రలతో దాడి చేసి కొండచిలువను హతమార్చారు.

గాయపడిన వ్యక్తి మృతి



స్వామి మృతదేహం

సారంగపూర్‌: మండలంలోని బీరవెల్లి గ్రామానికి చెందిన మేకల స్వామి(44) నిర్మల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందినట్లు ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. స్వామి ఈనెల 1వ తేదీన బీరవెల్లి నుంచి ప్యారమూర్‌ గ్రామ సమీపంలోని తన పంటపొలానికి ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. ఈ క్రమంలో వాహనం అదుపుతప్పి చెట్టును ఢీకొనడంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ క్రమంలో ఆయనను నిర్మల్‌ ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి స్వామి మృతి చెందాడు. భార్య గంగామణి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పోలీసులు దిద్దిన కాపురం..

''ఇచ్చోడ మండలానికి చెందిన యువకుడు ఎనిమిదేళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. మొదటి, రెండవ కాన్పులో ఇద్దరు ఆడ పిల్లలు పుట్టారు. మూడవ కాన్పులోనూ ఆడ పిల్లే జన్మించింది. మగ పిల్లలు పుట్టడంలేదని భార్యను వేధించడం మొదలుపెట్టాడు. చీటికిమాటికి భార్యతో గొడవ, భర్త టార్చర్‌తో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. తల్లిదండ్రుల ప్రమేయంతో పంచాయతీ పోలీస్‌స్టేషన్‌కు చేరింది. పోలీసుల కౌన్సెలింగ్‌ ద్వారా ప్రస్తుతం వారి కాపురం సజావుగా సాగుతోంది.''

''గుడిహత్నూర్‌ మండలానికి చెందిన వ్యక్తికి కొన్నేళ్ల క్రితం ఆదిలాబాద్‌ జిల్లా కేంద్రానికి చెందిన యువతితో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. భర్తపై భార్యకు, భార్యపై భర్త అనుమానాలు ఎక్కువయ్యాయి. దీంతో ఇంట్లో గొడవలు మొదలయ్యాయి. ఇరువురి మధ్యలో మనస్పర్థలు ఏర్పడి తరుచూ గొడవలతో పోలీస్‌స్టేషన్‌ మెట్లెక్కారు.''

- భార్యాభర్తల మధ్య చీటికిమాటికి చిర్రుబుర్రులాటలు
- చిన్న సమస్యకే ఠాణా మెట్లెక్కుతున్న వైనం
- కౌన్సెలింగ్‌ ద్వారా ఒకటిచేస్తున్న పోలీసులు



ఇచ్చోడ పోలీస్‌స్టేషన్‌లో కౌన్సెలింగ్‌ చేస్తున్న ఉట్నూర్‌ డీఎస్పీ(ఫైల్‌)

ఇచ్చోడ: ఇలా చిన్నచిన్న మాటలకే అనుమానపడటం, ఒకరిపై ఒకరు చిర్రుబుర్రులాడుకోవడం, తరుచూ గొడవపటడం వంటి సంఘటనలు అన్యోన్యంగా ఉండాల్సిన కాపురంలో భార్యాభర్తల మధ్య దురాన్ని పెంచుతోంది. నువ్వేంతంటే నువ్వేంత అనే పంతాలకు పోయి గోటితో పోయేదాన్ని గొడ్డలి వరకు తెచ్చుకొని పచ్చని సంసారాల్లో నిప్పులు పోసుకుంటున్నారు. కుటుంబం అంటే చిన్నచిన్న సమస్యలు సర్వసాధారణం.. వాటిని సమన్వయంతో పరిష్కరించుకుంటూ వెళితే వాటికవే పరిష్కరమవుతాయి. ఇటువంటి సమయంలో ఇరువర్గాల తల్లిదండ్రులు కుటుంబ సభ్యులు సంయమనం పాటించాలి. వారు కూడా అగ్నికి ఆజ్యం పోసినట్లు వ్యవహరిస్తే సమస్య మరింతగా సంక్లిష్టంగా మారుతుంది. దీంతో చివరికి ఠాణా మెట్లు ఎక్కి కోర్టుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొంటుంది.

రాజీకే ప్రాధాన్యత..

జిల్లా కేంద్రంలోని మహిళా పోలీస్‌స్టేషన్‌తో పాటు మిగితా పోలీస్‌స్టేషన్లలో నమోదవుతున్న భార్యాభర్తల కేసులు రాజీకే ప్రాధాన్యత ఇస్తున్నారు. పోలీసులు వీలైనంత వరకూ కౌన్సెలింగ్‌తో కలిసిపోయేలా చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇద్దరి మధ్య పట్టు వీడకపోతే కేసులు నమోదు చేస్తున్నారు.

ఆదిలాబాద్‌ జిల్లాలో ఠాణాల్లో ఫిర్యాదులు, కేసులు

ఏడాది	ఫిర్యాదులు	ఎఫ్‌ఐఆర్‌	పరిష్కారం
2022	572	96	476
2023	428	45	383



గౌరవం ఇచ్చిపుచ్చుకోవాలి..



రోజురోజుకూ మానవ సంబంధాలు దూరమవుతున్నాయి. భార్యాభర్తలు, తల్లిదండ్రులు అనే గౌరవం లేకుండా పోతోంది. భార్యాభర్తల మధ్య సమన్వయం తగ్గిపోతుంది. ఒకరిపై ఒకరికి గౌరవం లేదు. దీంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. సమాజంపై అవగాహన లేకపోవడం కూడా ఓ కా రణం. భార్యాభర్తలు గౌరవాన్ని ఇచ్చిపుచ్చుకొనే విధంగా మెలగాలి.

– ఓంప్రకాశ్, సైక్రియాటిస్టు, రిమ్స్, ఆదిలాబాద్‌

కాపురం నిలబెట్టేలా కౌన్సెలింగ్‌

భార్యాభర్తలు గొడవ పడి ఆవేశం, కోపంలో గొడవపడి పోలీస్‌స్టేషన్‌ మెట్లు ఎక్కుతున్నారు. అలాంటి వారికి పలు దఫాలుగా కౌన్సెలింగ్‌ నిర్వహించి కాపురాన్ని నిలబెట్టడానికి కృషి చేస్తున్నాం. ఎక్కువ కేసులు రాజీమార్గం ద్వారా పరిష్కరమవుతున్నాయి. కౌన్సెలింగ్‌ ద్వారా కూడా మార్పురాని కొన్ని మొండి కేసులను ఎఫ్‌ఐఆర్‌ నమోదు చేస్తున్నాం.

– శ్రీనివాస్, మహిళా పోలీస్‌స్టేషన్, సీఐ, ఆదిలాబాద్‌

తపాల శాఖ ద్వారా విదేశాలకు పార్సిల్‌



మాట్లాడుతున్న సుజిత్‌ కుమార్‌

ఉట్నూర్‌రూరల్‌: ఆదిలాబాద్‌ ప్రధాన తపాల కార్యాలయం నుంచి డాక్‌ నిర్యాత్‌ కేంద్ర సర్వీస్‌ ద్వారా తక్కువ ఖర్చుతో విదేశాలకు సులభంగా పార్సల్స్‌ పంపే సేవలు ప్రారంభించినట్లు ఆదిలాబాద్‌ సబ్‌ డివిజన్‌ ఇన్స్‌పెక్టర్‌ సుజిత్‌కుమార్‌ తెలిపారు. శుక్రవారం ఉట్నూర్‌ పరిధిలోని బ్రాంచి పోస్ట్‌ మాస్టర్లతో సమావేశం నిర్వహించారు. విదేశాలకు పార్సల్‌ సేవలు అందుబాటులోకి వచ్చినట్లు తెలిపారు. శుక్రవారం ప్రధాన తపాల కార్యాలయంలో సైతం విదేశాలకు పార్సెల్‌ సర్వీస్‌ కరపత్రాలు జారీ చేసినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు సమీప పోస్టు ఆఫీసుల్లో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీఎం తిరుపతి, రమేశ్, బీపీఎంలు చంద్రశేఖర్, ప్రవీన్, గోకుల్, విజయ్, సాద్‌ తదితరులు పాల్గొన్నారు.

ఒకరి అదృశ్యం

ఆదిలాబాద్‌రూరల్‌: మావల పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని షాద్‌నగర్‌కు చెందిన మోసిన్‌ఖాన్‌ (35) అదృశ్యమైనట్లు ఎస్సై విష్ణువర్ధన్‌ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మోసిన్‌ ఖాన్‌ ఈ నెల 4న ఉదయం 9గంటలకు ఇంటి నుంచి వెళ్లారు. ఆయన ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు గాలించినప్పటికీ ఫలితం కానరాలేదు. దీంతో అతడి భార్య సమ్రీన్‌ ఖానం ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఘనంగా హనుమాన్‌ ఆలయ పునః ప్రతిష్ఠ



గణపతి పూజలో పాల్గొన్న భక్తులు

- మూడు రోజుల పాటు ఉత్సవాలు
- 10న విగ్రహ ప్రతిష్ఠ, మహా అన్నదానం

నిర్మల్‌చైన్‌గేట్‌: నిర్మల్‌లోని నాయుడువాడలో కొలువుదీరిన గుట్ట వీరన్న ఆంజనేయ ఆలయంలో శుక్రవారం నుంచి ఆలయ పునః ప్రతిష్ఠ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం ప్రారంభమైన వేడుకలు ఈ నెల 10 ఆదివారం వరకు కొనసాగనున్నాయి. మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ఆలయాభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇచ్చారు. ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి రూ.38 లక్షలు మంజూరు చేయించడంతో ఆలయ రూపురేఖలే మారిపోయాయి. శుక్రవారం ఉదయం యంత్ర ప్రతిష్ఠాపన కార్యక్రమంలో భాగంగా గణపతి పుజ, అఖండ దీపారాధన, పుణ్యాహవచన, రక్షబంధన, అంకురార్పణ, పంచగవ్య ప్రాశన తదితర కార్యక్రమాలు చేపట్టారు. శనివారం గణపతి పూజ, శపన మండప ఆరాధన విగ్రహ పంచామత అభిషేకము, స్థాపిత హోమాలు, మహా హారతి తీర్థ ప్రసాద వితరణ చేపట్టనున్నారు. ఆదివారం ఉదయం గం 7.30 గంటలకు వీరాంజనేయ స్వామి సమేతశివ పంచాయతన యంత్ర ప్రతిష్టా విగ్రహ ప్రతిష్ఠ నిర్వహిస్తారు.



పునఃప్రతిష్ఠకు సిద్ధంగా ఉన్న హనుమాన్‌ విగ్రహం

ఉపాధ్యాయ సమస్యలు తీర్చాలని ధర్నా



ఐటీడీఏ ఎదుట ధర్నా చేస్తున్న ఉపాధ్యాయ సంఘ నాయకులు



పీవోకు మెమోరండం అందిస్తున్న సంఘ నాయకులు

ఉట్నూర్‌రూరల్‌: ఉపాధ్యాయులు, విద్యార్థుల, పాఠశాలల సమస్యలను తీర్చాలని కోరుతూ తెలంగాణ ప్రోగ్రెసివ్‌ టీచర్స్‌ ఫెడరేషన్‌ (టీపీటీఎఫ్‌) సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఉట్నూర్‌ ఐటీడీఏ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆత్రం భుజంగ్‌రావు మాట్లాడుతూ.. జీవో నంబర్‌ 3 అమలుపై ప్రభుత్వం స్పష్టమైన వైఖరి ప్రకటించాలని తెలిపారు. బదిలీలు, పదోన్నతులపై షెడ్యూల్‌ విడుదల చేయాలని, ఉపాధ్యాయులకు కేటాయించిన హాస్టల్‌ అదనపు విధుల నుంచి మినహాయింపు ఇచ్చి వారిని బోధనకు పరిమితం చేయాలన్నారు. అదే విధంగా గిరిజన సంక్షేమ ఉపాధ్యాయులందరికీ రెసిడెన్షియల్‌ ఉపాధ్యాయుల పేస్కేల్‌ను వర్తింపచేయాలని, గిరిజన విద్యాభివృద్ధి, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఉత్తర్వుల ప్రకారం ప్రతీ మూడు మాసాలకు ఓసారి ఉపాధ్యాయ సంఘాలతో సమన్వయ సమావేశాలను నిర్వహించాలన్నారు. 10వ తరగతి విద్యార్థులకు విద్యా సంవత్సరం ప్రారంభంలోనే స్టడిమెటీరియల్‌ను అందించాలని, గిరిజన విద్యార్థుల ఆరోగ్య సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. అందుకు రిజర్వ్‌ ఫండ్‌ మంజూరు చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గిరిజన సంక్షేమ హాస్టళ్లను ఆశ్రమ పాఠశాలలుగా మార్చాలని తదితర డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఐటీడీఏ పీవో చాహత్‌ బాజ్‌పాయ్‌కు మెమోరండం సమర్పించారు. పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు వారికి మద్దతు తెలిపారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆత్రం సుగుణ, కుమ్రం భీం జిల్లా కార్యదర్శి కనక వెంకటేశ్వర్‌రావు, మర్సుకోల జ్ఞానేశ్వర్, కల్పన, గంగాసాగర్, జ్యోతిరాం, జ్ఞానేశ్వర్, వినోద్, కృష్ణప్రసాద్, సుందర్‌ పాల్గొన్నారు.

భైంసా బీఆర్‌ఎస్‌లో ఫ్లెక్సీ కలకలం..!

భైంసాటౌన్‌: భైంసా పట్టణంలోని గాంధీగంజ్‌ ఎదురుగా కాటన్‌ మార్కెట్‌ యార్డు ప్రవేశ ద్వారం వద్ద మాజీ చైర్మన్‌ పి.కృష్ణ పేరిట వెలిసిన ఫ్లెక్సీ స్థానికంగా బీఆర్‌ఎస్‌ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇటీవల కొద్దికాలంగా ప్రస్తుత ఏఎంసీ చైర్మన్‌ రాజేశ్‌బాబు వర్గం సిట్టింగ్‌ ఎమ్మెల్యేపై అసమ్మతి స్వరం ఎత్తుకున్న విషయం తెలిసిందే. మంత్రి తలసాని తనపై దాడి చేసిన వీడియోను స్థానిక బీఆర్‌ఎస్‌ శ్రేణులే సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేసి తనను అవమానించారని ఇదివరకు విలేకరుల సమావేశంలో ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు తననే ఉద్దేశించేలా కాటన్‌ మార్కెట్‌ ప్రవేశద్వారం వద్ద ఫ్లెక్సీ ఏర్పాటు చేసినట్లు వారు భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు దీనిపై రాజేశ్‌బాబు కౌంటర్‌ ఇవ్వనున్నట్లు సమాచారం.



కాటన్‌యార్డు వద్ద వెలిసిన ఫ్లెక్సీ

స్విమ్మింగ్‌పూల్‌లో పడి ఒకరి మృతి



శశికాంత్‌ (ఫైల్‌)

నిర్మల్‌టౌన్‌: స్విమ్మింగ్‌ పూల్‌లో పడి ఒకరు మృతిచెందిన సంఘటన శుక్రవారం జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. స్థానిక ప్రియదర్శని కాలనీలో శ్రీరామరాజు అనే వ్యక్తి నూతనంగా ఇల్లు నిర్మిస్తున్నాడు. గురువారం సాయంత్రం ఇంట్లో ఎవరు లేకపోవడంతో వారి దగ్గర సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న పట్టణంలోని పింజారిగుట్ట కాలనీకి చెందిన శశికాంత్‌ (35) తన మిత్రులతో కలిసి ఆ ఇంట్లో విందు చేసుకున్నాడు. ఈ క్రమంలో పైఅంతస్తులో నిర్మించిన స్విమ్మింగ్‌ పూల్‌లో ఈత కొట్టడానికి వెళ్లి ప్రమాదవశాత్తు అందులో పడి మృతిచెందాడు. వెంటనే స్నేహితులు అతడిని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. అనంతరం మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ పురుషోత్తం తెలిపారు.

ఉబికి వస్తున్న పాతాల గంగ



చేతిపంపు ద్వారా ఉబికివస్తున్న నీరు

తానూరు: మండలంలోని భోసి గ్రామంలోని చేతిపంపు నుంచి పాతాళ గంగ ఉబికివస్తోంది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు భూగర్భ జలాలు పెరగడంతో చేతిపంపు ద్వారా నీరు బయలకు వస్తోంది. శుక్రవారం గ్రామంలోని ప్రజలు చేతిపంపువద్దకు నీటి కోసం వచ్చే సరికి నీరు వృథాగా పోంతోంది. దీనిని చూసేందుకు గ్రామస్తులు తరలివచ్చారు. విషయాన్ని గమనించిన స్థానికులు సంబంధిత అధికారిని వివరణ కోరగా భూగర్భజ లాలు పెరగడంతో నీరు వస్తోందని తెలిపా రు.

తృటిలో తప్పిన ప్రమాదం

ముధోల్‌: మండల కేంద్రం ముధోల్‌లోని కంటి ఆస్పత్రి వద్ద శుక్రవారం ఉదయం తెల్లవారుజామున కారు బోల్తాపడింది. భైంసా నుంచి నిజామాబాద్‌ వైపు వృతిక్‌రెడ్డి అనే వ్యక్తి కారులో వెళ్తుండగా కంటి ఆస్పత్రి వద్దకు రాగానే అతి వేగంగా వెళ్లి రోడ్డు డివైడర్‌ను ఢీకొనడంతో కారు బోల్తాపడింది. వృతిక్‌రెడ్డి ప్రాణాలతో బయటపడ్డాడు.

వడ్డెరులను షెడ్యూల్డ్‌ తెగల్లో చేర్చాలి



పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఉట్నూర్‌రూరల్‌: అభివృద్ధికి ఆమడదూరంలోని వడ్డెర్లను షెడ్యూల్డ్‌ తెగల్లో చేర్చాలని తెలంగాణ రాష్ట్ర వడ్డెర సంక్షేమ సంఘం అధ్యక్షుడు ద్యారంగుల నగేశ్‌ డిమాండ్‌ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ప్రెస్‌భవన్‌లో వడ్డెర కులస్తుల ప్రతినిధుల మహాసభ వాల్‌ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో వడ్డెరుల జీవితాలు దుర్భరంగా ఉన్నాయన్నారు. వడ్డెర్లకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని, అభివృద్ధికి ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలని కోరారు. క్వారీలలో పూర్తి హక్కు వడ్డెర్లకు, కాంట్రాక్ట్‌ పనులలో 20 శాతం రిజర్వేషన్‌ కల్పించాలన్నారు. అందరికీ ప్రమాద బీమా కల్పించాలని తెలిపారు. ఇతర సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 12న హైదరాబాద్‌లో వడ్డెరల ప్రతినిధుల మహాసభ నిర్వహించడం జరుగుతుందని, ఈ సమావేశానికి అధిక సంఖ్యలో వడ్డెర నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ వ్యవస్థాపకులు ఎల్లపు సమ్మయ్య, మండల అధ్యక్షుడు భుజంగ్‌రావు, నాగరాజు, సతీశ్, గోవింద్, తిమ్మయ్య, సంపంగి రమేశ్‌ ఉన్నారు.

ఖబ్రస్థాన్‌కు దారేది



అంత్యక్రియల కోసం శవంతో వాగు దాటుతున్న గ్రామస్తులు

జైనథ్‌: గ్రామంలో ఎవరైనా మరణిస్తే అంత్యక్రియల కోసం మండలంలోని గూడ గ్రామ ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారు. గ్రామానికి చెందిన షేక్‌ అజీజ్‌ మరణించగా అంత్యక్రియలు శుక్రవారం నిర్వహించారు. ఖబ్రస్థాన్‌కు వెళ్లే దారిలో వాగు ఉండడంతో కుటుంబ సభ్యులు, బంధువులు ఇలా దాటి వెళ్లారు. ఏళ్ల గడిచినా గ్రామంలో కనీస సౌకర్యాలు కానరావడం లేదని, అంత్యక్రియలకు సైతం అవస్థలు పడాల్సి వస్తుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వంతెన నిర్మించి కష్టాలు తీర్చాలని కోరుతున్నారు.

ఆర్టీసీ లక్కీడ్రా విజేతలకు బహుమతుల ప్రదానం



లక్ష్మికి చెక్కు అందజేస్తున్న సజ్జనార్‌



చెక్కు అందుకుంటున్న కే.ప్రాంజల్‌



బహుమతి అందుకుంటున్న రాజశ్రీ

రాఖీ పండుగను పురస్కరించుకుని ఆర్టీసీ ఆధ్వర్యంలో ప్రయాణికులకు నిర్వహించిన లక్కీడ్రా విజేతలకు హైదరాబాద్‌లో శుక్రవారం ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌ బహుమతి ప్రదానం చేశారు. మొదటి బహుమతి భైంసాకు చెందిన ఎస్‌.లక్ష్మికి రూ.25వేలు, ద్వితీయ బహుమతి ఆదిలాబాద్‌కు చెందిన విద్యార్థిని కే.ప్రాంజల్‌కు రూ.15వేలు, తృతీయ బహుమతి డి.రాజశ్రీకి రూ.10వేలు విలువైన చెక్కులను అందజేశారు.